సంతానలేమికి కారు సీటూ కారణం కావొచ్చు!



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): సంతాన లేమి సమస్యతో బాధ పడుతున్న దంపతుల సంఖ్య ఈ మధ్య ఎక్కువైంది. అందుకే ప్రతి నగరంలో సంతాన సాఫల్య కేంద్రాలు వెలుస్తున్నాయి. అయితే తాజాగా ఇంగ్లండ్ శాస్త్రజ్ఞులు సంతాన లేమికి కారు సీటు కూడా కారణం కావచ్చని గుర్తించారు. మాంచెస్టర్ యూనివర్సిటీలోని అండ్రాలజీ ప్రొఫెసర్ అలన్ పేషీ తెలిపిన వివరాల ప్రకారం సంతానోత్పత్తికి అవసరమైన వీర్య కణాల ఉత్పత్తి సక్రమంగా జరగాలంటే పురుషుల శరీరంలోని మిగిలిన భాగాల కంటే వృషణాల వద్ద చల్లగా ఉండాలి. కారులో లేదా బైకుపై ప్రయాణించేటప్పుడు పురుషులు కూర్చునే సీటు వేడిగా ఉండటం వల్ల వృషణాలలో వీర్య కణాల సంఖ్య తగ్గిపోతున్నది. బిగుతైన ప్యాంటు ధరించడం లేదా కారు లేదా ద్విచక్ర వాహనంపై ఎక్కువ దూరం ప్రయాణించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతున్నదని పరిశోధనలలో తేలింది.

ప్రైవేట్ కార్లు బెంగళూరులోనే ఎక్కువ

న్యూఢిల్లీ: దేశంలో ఎక్కువ ప్రైవేట్ కార్లు ఉన్న నగరం ఘనత ఢిల్లీ చేజారింది. 23.1 లక్షల ప్రైవేట్ కార్లతో బెంగళూరు నగరం ఈ ఘనత దక్కించుకుంది. 2023 మార్చి 31 నాటికి ఢిల్లీలో 20.7 లక్షల ప్రైవేట్ కార్లు మాత్రమే ఉన్నాయి. ఢిల్లీ స్టాటిస్టికల్ హ్యాండ్‌బుక్ 2023లో ఈ వివరాలను వెల్లడించారు. 2021-22, 2022-23లలో 55 లక్షల కార్లు డీరిజిస్టర్ అయ్యాయని, 1.4 లక్షల కార్లు స్క్రాప్‌గా నిష్క్రమించాయని ఈ పుస్తకంలో తెలిపారు. పదేళ్లు దాటిన డీజిల్ కార్లను, 15 ఏండ్లు దాటిన పెట్రోలు కార్లను సుప్రీంకోర్టు నిషేధించిందని తెలిపారు.

భలే టేస్ట్.. బాస్మతి బెస్ట్

ఉత్తమ బియ్యంగా ప్రపంచ కిరీటం

న్యూఢిల్లీ, జనవరి 13: రుచి, నాణ్యతకు మారుపేరైన భారత్‌లో పండించే బాస్మతి బియ్యం ప్రపంచ స్థాయిలో సత్తా చాటింది. ప్రపంచంలోని ఉత్తమ బియ్యంగా బాస్మతి కిరీటాన్ని దక్కించుకుందని ప్రముఖ ఫుడ్, ట్రావెల్ గైడ్ టేస్ట్ అట్లాస్ ప్రకటించింది. 2023-24 ఏడాదికి ప్రకటించిన అవార్డుల సందర్భంగా బాస్మతిపై ప్రశంసల వర్షం కురిపించింది. పొడవైన ధాన్యం బియ్యం రకానికి చెందిన బాస్మతిని భారత్, పాకిస్థాన్‌లలో పండిస్తుంటారు. బాస్మతి బియ్యం వండిన తర్వాత దాని నుంచి మంచి వచ్చే సుగంధ పరిమళం, రుచి, స్వల్పంగా ఉండే కారం దానికో ప్రత్యేకతను చేకూరుస్తాయి. ఎలాంటి కూరలు, సాస్‌లు, సూప్‌లు ఇతర పదార్థాలలోనైనా దీనిని సులభంగా కలుపుకుని తినవచ్చు. ఇక బాస్మతి బియ్యంతో తయారు చేసే బిర్యానీకి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది అభిమానులున్నారు. బాస్మతి తర్వాత రెండో స్థానంలో ఇటలీకి చెందిన అర్బోరియా, మూడో స్థానంలో పోర్చుగల్‌కు చెందిన కరోలినా బియ్యం నిలిచాయి. ఇక నాలుగైదు, స్థానాలను స్పెయిన్, జపాన్ బియ్యం దక్కించుకున్నాయి.

ఈ ఏడాది మరింత భగభగలు!

జెనీవా: అత్యంత వేడిమి సంవత్సరంగా 2023 రికార్డులకెక్కింది. అయితే దానిని మించి ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రమాదం ఉందని, ఎలినినో కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడుతుందని ఐక్యరాజ్య సమితి శుక్రవారం హెచ్చరించింది. ఉద్గారాల నివారణ చర్యలు పెద్దయెత్తున చేపట్టాలని కోరింది. ఎలినినో కారణంగా ఈ ఏడాది కూడా అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేసింది.

హెచ్1బీ ఆన్‌లైన్ దరఖాస్తుకు అవకాశం

- ఆర్గనైజేషనల్ అకౌంట్స్ ద్వారా దాఖలు చేసే సౌలభ్యం

వాషింగ్టన్: 2024-25 ఆర్థిక సంవత్సరానికి హెచ్-1బీ వీసాల కోసం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు ఫిబ్రవరి నుంచి అవకాశం కల్పించనున్నట్లు అమెరికా ఇటీవల ప్రకటించింది. యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) కూడా హెచ్-1బీ రిజిస్ట్రేషన్స్ ఆన్‌లైన్ కొలాబరేషన్, సబ్మిషన్‌లకు అవకాశం కల్పించే ఆర్గనైజేషనల్ అకౌంట్స్‌ను ప్రవేశపెట్టబోతున్నది. అకౌంట్ లభ్యత, రిజిస్ట్రేషన్ తేదీలకు సంబంధించిన అధికారిక ప్రకటన ఈ నెలాఖరునాటికి వెలువడే అవకాశం కనిపిస్తున్నది. పరిమితి లేని ఫైలింగ్స్, 2025 ఆర్థిక సంవత్సరం పరిమితి సీజన్ కోసం ఆర్గనైజేషనల్ అకౌంట్స్‌ను ప్రారంభించబోతున్నట్లు యూఎస్‌సీఐఎస్ ప్రకటించింది. హెచ్-1బీ రిజిస్ట్రేషన్స్ కోసం సమన్వయంతో పని చేసి, తయారుచేసే అవకాశం ఆర్గనైజేషనల్ అకౌంట్స్‌లో కంపెనీ లేదా ఇతర వ్యాపార సంస్థల్లోని వ్యక్తులకు, వారి లీగల్ రిప్రజెంటేటివ్‌లకు ఉంటుందని తెలిపింది. నాన్ ఇమిగ్రెంట్ వర్కర్ కోసం దరఖాస్తు ఫారం ఐ-129 అని, ప్రీమియం ప్రాసెసింగ్ సర్వీస్ కోసం విజ్ఞప్తి కోసం ఫారం ఐ-907 అని తెలిపింది. ఈ ఫారాలను ఆర్గనైజేషనల్ అకౌంట్స్ ద్వారా ఆన్‌లైన్‌లో దాఖలు చేయవచ్చు. ఎలక్ట్రానిక్ ఫైలింగ్ కోసం లీగల్ రిప్రజెంటేటివ్‌కు అధికారం ఇవ్వవచ్చు. సంప్రదాయ పద్ధతిలో కాగితంపై ముద్రించి, రాసిన ఫారం ఐ-129ను కూడా దాఖలు చేయవచ్చు. అయితే హెచ్-1బీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మాత్రం ఆన్‌లైన్‌లో మాత్రమే జరుగుతుంది. యూఎస్‌సీఐఎస్ ఆర్గనైజేషనల్ అకౌంట్స్‌పై ఈ నెల 23, 24 తేదీల్లో రెండు నేషనల్ ఎంగేజ్‌మెంట్ సెషన్స్‌ను నిర్వహిస్తుంది. హెచ్-1బీ వీసా రిజిస్ట్రేషన్ పీరియడ్‌కు ముందే ఈ ప్రక్రియను ఏ విధంగా పూర్తి చేయాలో ఆర్గనైజేషన్లకు, వాటి లీగల్ రిప్రజెంటేటివ్‌లకు వివరిస్తుంది.

అమెరికాలో తుఫాను అలజడి

- వేలాది విమానాల రద్దు..ఆలస్యం
- అంధకారంలో లక్షలాది కుటుంబాలు

చికాగో, జనవరి 13: అమెరికాలో శీతాకాలపు తుఫాను అలజడి సృష్టించింది. మిడ్‌వెస్ట్, దక్షిణ ప్రాంతాల్లో ఈ తుఫాను కారణంగా శుక్రవారం రెండు వేలకు పైగా విమానాలు రద్దవ్వగా, 5,604 సర్వీసులు ఆలస్యంగా రాకపోకలు సాగిస్తున్నాయి. పలు విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌ను నిలిపివేశారు. వందలాది మంది ప్రయాణికులు గంటల తరబడి విమానాశ్రయాలలో చిక్కుకుపోయారు. గత ఏడాది జూలై తర్వాత ఇంత భారీ స్థాయిలో విమానాలు రద్దు కావడం ఇదే ప్రథమం. తుఫాను వల్ల గ్రేట్ లేక్స్, దక్షిణ ప్రాంతంలో సుమారు 2.5 లక్షల కుటుంబాలు అంధకారంలో చిక్కున్నాయి. అమెరికా తూర్పు ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మధ్య పశ్చిమ ప్రాంతంలో మంచు తుఫాను ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. చలిగాలుల తీవ్రత కారణంగా 1.5 కోట్ల మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అయోధ్య రామాలయం.. లౌకికవాద చిహ్నం

నాడు అనేక పార్టీలు ఓటు బ్యాంక్ రాజకీయాలు చేశాయి

ఆలయ నిర్మాణంపై గర్విస్తున్నా.. బీజేపీ నేత అద్వానీ

అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠ కోసం జోరుగా సాగుతున్న ఏర్పాట్లు



చెన్నై, జనవరి 13: అయోధ్య ఆలయ నిర్మాణం నిజమైన లౌకిక వాదానికి చిహ్నమని బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్‌కే అద్వానీ అన్నారు. అయోధ్య రామజన్మభూమిలో శ్రీరాముడి ఆలయ నిర్మాణమే లక్ష్యంగా 1990లో తాను రథయాత్ర చేపట్టానన్నారు. 'శ్రీరామ మందిరం: దైవ స్వప్నం పూర్తి' పేరుతో ఆయన రాసిన వ్యాసాన్ని శనివారం మీడియాకు విడుదల చేశారు. 'ముస్లిం ఓట్లు పోతాయన్న భయంతో అనేక రాజకీయ పార్టీలు 'అయోధ్య సమస్య'కు దూరంగా ఉన్నాయి. ఆయా పార్టీలు ఓటు బ్యాంక్ రాజకీయాలకు లొంగిపోయి..తమ చర్యల్ని బూటకపు లౌకికవాదంతో సమర్థించుకున్నాయి' అని వ్యాసంలో ఆనాటి రాజకీయ పార్టీల తీరును అద్వానీ విమర్శించారు. విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో దేశం యావత్తు రామ మాయ కమ్ముకున్నదని, ఆర్ఎస్ఎస్, బీజేపీ కార్యకర్తగానే కాదు..దేశ పౌరుడిగానూ ఇందుకు గర్వపడుతున్నానని అద్వానీ సంతోషం వ్యక్తం చేశారు. 'శ్రీరాముడి ఆలయ నిర్మాణమనే లక్ష్యాన్ని రథయాత్ర నెరవేర్చింది. అంతేకాదు..బూటకపు లౌకికవాదం దాడి నుంచి.. నిజమైన లౌకికవాదాన్ని నిలబెట్టడంలోనూ 'అయోధ్య సమస్య' సక్సెస్ అయ్యింది. నిజమైన అర్థానికి నిలువెత్తు చిహ్నంగా మారింది' అని అన్నారు.

కాశీలో 40 రోజులపాటు పూజలు

తమిళనాడులోని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామిగల్ విగ్రహ ప్రతిష్ఠ వేడుకకు హాజరు కావటం లేదని తెలిసింది. కాశీలోని యజ్ఞశాలలో 40 రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడుతున్నామని, 100 మందికిపైగా వైదిక పండితుల ఆధ్వర్యంలో జనవరి 22న యజ్ఞశాలలో పూజలు మొదలవుతాయని తెలిపారు. ఇదిలా ఉండగా, 'శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ' కార్యక్రమానికి నలుగురు శంకరాచార్యులు హాజరుకావటం లేదన్న మీడియా కథనాల్ని పూరి శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి ఖండించారు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంపై తమ మధ్య ఎలాంటి విభేదాల్లేవన్నారు.

ప్రాణ ప్రతిష్ఠ తీరుపై నిర్మోహి అఖాడా ఆగ్రహం

అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ఠ సరిగా జరగడం లేదని నిర్మోహీ అఖాడా తెలిపింది. శ్రీరామ జన్మభూమి-బాబ్రీ మసీదు కేసులో ప్రధాన పిటిషనర్లలో నిర్మోహీ అఖాడా ఒకటి. ఈ నెల 22న జరిగే ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం రామానంది సంప్రదాయానికి అనుగుణంగా జరగడం లేదని, మిశ్రమ సంప్రదాయాన్ని పాటిస్తున్నారని నిర్మోహీ అఖాడా సీనియర్ మహంత్ తెలిపారు. బొట్టు, ఇతర చిహ్నాలు రామానంది సంప్రదాయంలో విభిన్నంగా ఉంటాయన్నారు.

అతిథులకు 'రామ్‌రాజ్' మట్టి

జనవరి 22నాటి కార్యక్రమంలో పాల్గొనే అతిథులకు 'రామ్ రాజ్' మట్టిని బహుమతిగా ఇవ్వబోతున్నామని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం శనివారం ప్రకటించింది. దేశ విదేశాలకు చెందిన 11 వేల మందికిపైగా అతిథులకు ఆహ్వానాలు పంపారు. వీళ్లందరికీ ఆలయం శంకుస్థాపన వేళ తవ్విన మట్టిని (రామ్ రాజ్), మోతిచూర్ లడ్డు ప్రసాదాన్ని ట్రస్ట్ తరఫున ఇవ్వబోతున్నట్టు ట్రస్ట్ సభ్యుడు ఒకరు తెలిపారు.

త్వరలో 300 ఇథనాల్ స్టేషన్ల ప్రారంభం

న్యూఢిల్లీ : ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ త్వరలో దేశవ్యాప్తంగా 300 ఇథనాల్ ఇంధన స్టేషన్లను ప్రారంభించబోతున్నదని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ శుక్రవారం చెప్పారు. ఇథనాల్ పంపులను తెరవాలన్న తన డిమాండ్‌ను పెట్రోలియం మంత్రి అంగీకరించారని తెలిపారు. మహారాష్ట్రలోని పుణేలో జరిగిన ఓ సమావేశానికి హాజరైన గడ్కరీ విలేకర్లతో మాట్లాడారు. చమురును దిగుమతి చేసుకునే దేశాల్లో ప్రపంచంలో భారత దేశం మూడో స్థానంలో ఉంది. కర్బన ఉద్గారాలను 2070 నాటికి శూన్య స్థాయికి చేర్చాలని పట్టుదలగా కృషి చేస్తున్నది. అందుకే ఇథనాల్‌ను ఇంధనంగా వాడాలని ప్రయత్నిస్తున్నది. శుద్ధమైన ఇంధన వనరులుగా మారడానికి దోహదపడే విధంగా హైబ్రిడ్ వాహనాలపై పన్నుల తగ్గింపును వాణిజ్య శాఖ సమర్థించింది.

బియ్యం, గోధుమ ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తేయం: గోయల్

న్యూఢిల్లీ, జనవరి 13: గోధుమ, బియ్యం, చక్కెర ఎగుమతులపై అమలవుతున్న ఆంక్షలను ఎత్తివేసే ప్రతిపాదనేదీ ప్రస్తుతానికి తమ వద్ద లేదని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ తెలిపారు. అలాగే గోధుమలు, పంచదారలను దిగుమతి చేసుకునే ప్రణాళికగాని, అవసరం గాని దేశానికి లేదని తెలిపారు. 2022 మే నెలలో గోధుమ ఎగుమతులపై భారత్ నిషేధం విధించింది. బాస్మతేతర బియ్యం ఎగుమతులను గత ఏడాది జూలై నుంచి నిషేధించడమే కాక పంచదార ఎగుమతులపై ఆంక్షలను గత ఏడాది అక్టోబర్ తర్వాత పొడిగించింది. అయితే ఆహార భద్రతను ఎదుర్కొంటున్న ఇండోనేషియా, గాంబి యా, సెనెగల్ లాంటి మిత్రదేశాలకు మాత్రం బియ్యాన్ని పంపిస్తున్నామని చెప్పారు.

గోప్యతకు గట్టి భరోసా.. 'సంభవ్'

న్యూఢిల్లీ : భారత సైన్యం కట్టుదిట్టమైన భద్రత గల మొబైల్ ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేసింది. సెక్యూర్ ఆర్మీ మొబైల్ భారత్ వెర్షన్ (సంభవ్) అని పిలుస్తున్న ఈ వ్యవస్థలో మూడో కంటికి తెలియకుండా సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవచ్చునని చెప్పింది. భారత దేశ రక్షణ సామర్థ్యాలలో ఇది గొప్ప ముందడుగు అని తెలిపింది. ప్రముఖ విద్యా, పారిశ్రామిక నిపుణుల సహకారంతో సంభవ్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపింది. 5జీ టెక్నాలజీతో ఈ వ్యవస్థ పని చేస్తుందని చెప్పింది. ప్రజలు-సైన్యం ఈ టెక్నాలజీని ఉపయోగించుకోవచ్చు. ప్రారంభంలో రెండు దశల్లో 35,000 మొబైల్ హ్యాండ్ సెట్స్‌ను ఈ టెక్నాలజీతో వినియోగిస్తామని, ఈ నెల 15న 2,500 సెట్లను, మే 31నాటికి 32,500 సెట్లను వినియోగిస్తామని చెప్పారు.

తైవాన్ ఎన్నికల్లో చైనా వ్యతిరేకి గెలుపు

తైపేయి : తైవాన్ ప్రజలు చైనా దాష్టీకానికి ఎదురొడ్డి నిలిచారు. దేశాధ్యక్ష ఎన్నికల్లో చైనాను వ్యతిరేకించే డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (డీపీపీ)కి వరుసగా మూడోసారి పట్టం కట్టారు. ఈ ఎన్నికలు యుద్ధాన్ని లేదా శాంతిని ఎంచుకునేందుకు ఉపయోగపడతాయని చైనా చేసిన హెచ్చరికలను తైవాన్ ప్రజలు పట్టించుకోలేదు. శనివారం జరిగిన ఎన్నికల్లో డీపీపీ అభ్యర్థి లాయ్ చింగ్-టేను గెలిపించారు. తైవాన్ ప్రత్యేక అస్థిత్వాన్ని డీపీపీ బలంగా చాటి చెప్తుందనే సంగతి తెలిసిందే. తమ భూభాగంపై చైనా అధికారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పార్టీ అంగీకరించదు.

మాల్దీవులను విమర్శించే హక్కు ఎవరికీ లేదు: మాయిజ్జు

బీజింగ్, జనవరి 13: 'మాల్దీవులు చిన్న దేశమే కావొచ్చు, కానీ మమల్ని విమర్శించే హక్కు ఎవరికీ లేదు' అని ఆ దేశాధ్యక్షుడు మహమద్ మాయిజ్జు తాజాగా వ్యాఖ్యానించారు. చిన్న దేశం అయినంత మాత్రాన తమను బెదిరిస్తామంటే కుదరదని భారత్‌ను ఉద్దేశించి అన్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు తీవ్ర ఉద్రిక్తంగా మారిన వేళ భారత్‌పై మాయిజ్జు విరుచుకుపడ్డారు. చైనాలో ఐదు రోజుల పర్యటన ముగించుకొని మాల్దీవులకు బయల్దేరుతుండగా, శనివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. చైనా నుంచి మరింత మంది పర్యాటకులు మాల్దీవులకు వచ్చేట్టు చూడాలని బీజింగ్ నాయకత్వాన్ని ఆయన మరోమారు కోరారు.

మాలే సంస్కృతిపై పూర్తి విధేయత లేదు

ప్రవాస భారతీయులపై మలేసియా మాజీ పీఎం

కౌలాలంపూర్ : మలేసియాలో నివసిస్తున్న భారతీయులపై ఆ దేశ మాజీ ప్రధాని మహతీర్ మహమ్మద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఓ టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, మాలే సంస్కృతికి భారతీయులు పూర్తి విధేయత చూపటం లేదని విమర్శించారు. 'మలేసియాను ఇష్టపడేవారికే ఈ దేశం సొంతం. భారతీయులు మాలే సంస్కృతిలో ఐక్యం కావాల్సిన అవసరం ఉంది. ఇప్పటికీ కూడా చాలామంది భారతీయులు తమ ఇండ్లలో మాలే భాష కాకుండా తమిళం, ఇతర భాషలు మాట్లాడుతున్నారు' అని అన్నారు.

సంజీవని కాదు.. విషం!

17 వేల కరోనా మరణాలకు హెచ్‌సీక్యూ పరోక్ష కారణం

- మందు వినియోగంతో 11 శాతం పెరిగిన కొవిడ్ మరణాల రేటు
- కొవిడ్ సమయంలో హెచ్‌సీక్యూని సంజీవనిగా ప్రమోట్ చేసిన ట్రంప్
- ప్రపంచ దేశాలకు పంపిణీ చేశామని గొప్పగా ప్రకటించుకొన్న మోదీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): కొవిడ్-19 మహమ్మారిని ఎదుర్కొనేందుకు మందులే లేవనుకున్న సమయంలో మలేరియా నయానికి వాడే హైడ్రాక్సీ క్లోరోక్విన్ (హెచ్‌సీక్యూ) గోలీలు బాగా పని చేస్తున్నాయని, ఆ మందు సంజీవని అంటూ అప్పటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అందుకు మన ప్రధాని మోదీ సహా పలువురు వంత పాడిన విషయం తెలిసిందే. అయితే ఆ మందు సంజీవని కాదని, విషం అని పరిశోధకులు అధ్యయనం పేర్కొన్నది. అధ్యయనం ప్రకారం కరోనా సమయంలో ఆ మందును తీసుకోవడం వల్ల 17 వేల మరణాలు సంభవించాయని తేలింది. కరోనా నివారణలో అద్భుత ఔషధంగా ప్రచారం చేయబడిన హైడ్రాక్సీ క్లోరోక్విన్ మందు వినియోగం వల్ల మరణాల రేటు 11 శాతం వరకు పెరిగిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) మాజీ చీఫ్ సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్ పేర్కొనడం చర్చనీయాంశమైంది.

వినియోగానికి వ్యతిరేకంగా డబ్ల్యూహెచ్‌వో సిఫారసు

కరోనా మహమ్మారి ఉధృతంగా ఉన్న సమయంలో..డబ్ల్యూహెచ్‌వో.. హైడ్రాక్సీ క్లోరోక్విన్ సంభావ్య మందుగా భావించిందని, కానీ తాము దాని వాడకానికి వ్యతిరేకంగా సిఫారసు చేసినట్లు సౌమ్య స్వామినాథన్ పేర్కొన్నారు. అయితే క్లినికల్ ట్రయల్స్ పూర్తికాక ముందే ఆ మందుపై అప్పటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేయడం, భారత్‌లో ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని ప్రధాని మోదీని కోరడం తెలిసిందే.ట్రంప్ అడిగిందే తడవుగా తాము ప్రపంచానికి అవసరమైన క్లోరోక్విన్ మందులను సరఫరా చేస్తామంటూ ఎగుమతులపై నిషేధాన్ని మోదీ తొలగించారు. కానీ తర్వాత జరిగిన పరిశోధనల్లో హెచ్‌సీక్యూ మందు దీర్ఘకాలికంగానూ, అధిక మోతాదులో వాడకం వల్ల దుష్ప్రభావాలుంటాయని తేలింది.

ఒక్క నెలలో 10 వేల మంది మృతి

కాగా, ప్రపంచవ్యాప్తంగా కరోనా మరోసారి బుసలు కొడుతున్నది. గత డిసెంబర్ ఒక్క నెలలోనే 10 వేల మంది వైరస్ బారిన పడి మరణించినట్టు డబ్ల్యూహెచ్‌వో ప్రకటించింది. జేఎన్.1 వేరియంట్, పండుగల సీజన్ కావడంతో మరణాల సంఖ్య పెరిగినట్టు తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

మధ్యాహ్న భోజనానికి స్కూల్ బెంచీలే వంట చెరకు

పాట్నా, జనవరి 13: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టేందుకు తరగతి గదిలో వారు కూర్చునే బెంచీలనే వంట చెరకుగా మార్చేశారు. బీహార్‌లోని పాట్నా జిల్లా బిహ్‌టా బ్లాక్‌లోని అప్‌గ్రేడెడ్ మిడిల్ స్కూల్‌లో ఈ ఘటన జరిగింది. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో విద్యాశాఖ దర్యాప్తునకు ఆదేశించింది. మధ్యాహ్న భోజనం వండేందుకు కలప లేకపోవడంతో టీచర్ సవితా కుమారి బెంచీలను ఉపయోగించుకోమని చెప్పిందని, ఆ తర్వాత ఆమే వీడియో తీసి వైరల్ చేశారని వంట మనిషి ఆరోపించారు. ఈ ఆరోపణలను సవిత ఖండించారు. తనను అప్రతిష్ఠపాలు చేసేందుకే తనపై నిందలు వేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెంచీలను వంటచెరకుగా వాడుకోమని చెప్పింది తాను కాదని, స్కూలు ప్రిన్సిపాల్ అని ఆరోపించారు. ప్రిన్సిపాల్ మాత్రం దీనిని 'మానవ తప్పిదం'గా కొట్టిపడేశారు.

8 బెట్టింగ్ యాప్‌లపై ఈడీ కేసు

ఐపీఎల్ ప్రసారంపై ఫిర్యాదు

న్యూఢిల్లీ, జనవరి 13: మహాదేవ్ యాప్ తర్వాత 2023 ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించి ఎనిమిది బెట్టింగ్ యాప్‌లపై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ జాబితాలో పలువురు బాలీవుడ్ ప్రముఖులు ప్రమోట్ చేసిన 'ఫెయిర్ ప్లే' యాప్ ఉన్నది. వయాకామ్18 సంస్థ ఫిర్యాదుపై నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ కేసు నమోదు చేసిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఫెయిర్ ప్లే ఇతర యాప్‌లు అక్రమంగా ఐపీఎల్ టోర్నమెంట్‌లను తమ స్ట్రీమింగ్ సైట్లలో బ్రాడ్‌కాస్ట్ చేశాయని ఎఫ్ఐఆర్ పేర్కొన్నది. 2023 ఐపీఎల్ బ్రాడ్‌కాస్టింగ్ హక్కులు తమ సంస్థకు ఉండగా.. ఫెయిర్ ప్లే, ఇతర యాప్‌లు అక్రమ స్ట్రాట్స్‌వేర్ ఉపయోగించి తమ వెబ్‌సైట్లు, ఇతర వేదికలపై లైవ్ ఇచ్చాయని, జరుగుతున్న మ్యాచ్‌లపై బెట్టింగ్‌ను నిర్వహించాయని వెల్లడించింది. ఫెయిర్ ప్లే యాప్ ప్రకటనలను పలువురు నటులు, గాయకులు ప్రమోట్ చేశారని, అదేవిధంగా ప్రమోషన్ కోసం సోషల్ మీడియాతోపాటు రైళ్లు, మెట్రోలు, నగరాల్లో యాడ్స్ వేసిందని పేర్కొన్నది.

యుద్ధానికి 100 రోజులు

- హమాస్-ఇజ్రాయెల్ మధ్య ఇంకా కొనసాగుతున్న పోరు
- ఇజ్రాయెల్ సైన్యం దాడులతో పూర్తిగా ధ్వంసమైన గాజా స్ట్రిప్
- రెండు వైపులా వేలాది మరణాలు

గాజా సరిహద్దులో యుద్ధ వాతావరణాన్ని కండ్లకు కట్టినట్టు చూపే దృశ్యం

జెరూసలేం, జనవరి 13: హమాస్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం చెలరేగి ఆదివారంతో 100 రోజులు అయింది. గాజా భవిష్యత్తులో హమాస్‌ను లేకుండా చేస్తామని ఇజ్రాయెల్ ప్రతినబూనగా.. అది భ్రమేనని హమాస్ అంటున్నది. ఇజ్రాయెల్ ఏర్పాటైన 1948 నుంచి ఇంత సుదీర్ఘకాల, విధ్వంసకర యుద్ధం ఇదే. హమాస్ రాకెట్ దాడులపై తీవ్రస్థాయిలో స్పందించిన ఇజ్రాయెల్ సైన్యం అనంతరం పెద్దయెత్తున బాంబు దాడులతో గాజా స్ట్రిప్‌పై విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఫలితంగా ఇప్పటి వరకు దాదాపు 23 వేల మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య శాఖ చెబుతున్నది. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్ వైపు కూడా దాదాపు 1200 మంది మరణించగా.. దాదాపు 250 మంది హమాస్ బందీలుగా తీసుకెళ్లింది. 80 శాతం మంది గాజా జనాభా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు.

దిగ్బంధనంతో సంక్షోభ పరిస్థితులు

ఇజ్రాయెల్ సైన్యం దిగ్బంధనంతో గాజా ప్రజలు ఆహారం, తాగు నీరు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఒక్కమాటలో చెప్పాలంటే గాజా నివాసయోగ్యం కాని దిగా మారిపోయిందని యూఎన్ మానవతా గ్రూప్ చీఫ్ మార్టిన్ పేర్కొన్నారు.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై కలవరం

హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రాజేసింది. హమాస్‌కు మద్దతుగా లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా గ్రూపు కూడా ఇజ్రాయెల్‌పై యుద్ధానికి దిగిన విషయం తెలిసిందే. మరోవైపు ఇరాన్ మద్దతు గల యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారు. దాడులను ఆపాలని అమెరికా, మిత్రదేశాలు హౌతీలను హెచ్చరించాయి. వాటిని హౌతీలు పట్టించుకోకపోవడంతో అమెరికా, బ్రిటన్ శుక్రవారం యెమెన్‌లోని హౌతీ సైనిక స్థావరాలపై క్షిపణులతో దాడులకు దిగిన విషయం తెలిసిందే.

12 కోట్ల కుటుంబాలకు మా ఘోష వినిపిస్తాం

సంయుక్త కిసాన్ మోర్చా.. 16న సభ

న్యూఢిల్లీ : రైతులపై కేంద్రం తెచ్చిన నల్ల చట్టాలపై పోరాటం జరిపి విజయం సాధించిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఇప్పుడు రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రజల దృష్టికి తేవడంపై దృష్టి సారించింది. ఇంటింటికీ ప్రచారం నిర్వహించి సుమారు 12 కోట్ల కుటుంబాల దృష్టికి రైతుల ఇబ్బందులను, డిమాండ్లను తీసుకువెళ్లాలనే ధ్యేయంతో ప్రచారాన్ని ప్రారంభించింది.మద్దతు ధర, పంట రుణాల రద్దు, విద్యుత్ రంగం ప్రైవేటీకరణ తదితర అంశాలను మోర్చా ప్రజలకు వివరిస్తుంది. ఈ నెల 16న జలంధర్‌లో జరిగే జాతీయ సభలో ఈ సమస్యలపై చర్చించనున్నారు. 2021లో రైతులకు ప్రధాని మోదీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదని ఎస్‌కేఎం ఆరోపించింది. ప్రస్తుతం అమలవుతున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కార్పొరేట్లకు లాభం చేకూరుస్తున్నదే తప్ప వైపరీత్యాలు, ఇతర కారణాలతో పంటలు నష్టపోతున్న రైతులకు ప్రయోజనాన్ని కల్పించడం లేదని పేర్కొ